క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



తక్షణ సాయం అందిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని పామిడమ్మ సచివాలయ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మేకల పెద్ద సుంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం వైఎస్సార్‌బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ 4వ వార్డు ఇన్‌చార్జ్ ఈశ్వర్‌రెడ్డి,సచివాలయ అడ్మిన్ నాగరాజు మృతుడి కుమార్తె మేకల దస్తగిరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ ఈశ్వరయ్య, సచివాలయ కన్వీనర్లు శివయ్య, ఓబులేసు, వలంటీర్ రవి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న సీఐ అస్రార్ బాషా, ఎస్‌ఐ

శింగనమల: శింగనమల చెందిన చాకలి మోహన్ 20 రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న సీఐ అస్రార్‌బాషా, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మృతుడి కుటుంబానికి రూ.20 వేలు అందించారు. మోహన్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని సీఐ పేర్కొన్నారు. ఏఎస్‌ఐలు షేక్షావలి, చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత నిధులతో వీధిదీపాలు



వీధిదీపం వేయిస్తున్న సర్పంచు రామాంజులరెడ్డి

యల్లనూరు: తిరుమలాపురం సర్పంచు రామాంజులరెడ్డి సొంత నిధులతో గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. గ్రామంలో దాదాపు 30 వీధిదీపాలు పని చేయకపోవడంతో సర్పంచు రూ.50 వేలు ఖర్చు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

ప్రతిఒక్కరూ నీటిని సంరక్షించాలి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించాలని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 21 వరకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆంధ్ర బాలికల బెటాలియన్ కల్నల్ నీరజ్ గుప్తా మార్గదర్శకత్వంలో శింగనమల చెరువులో వ్యర్థ పదార్థాలు తొలగించారు. సీనియర్ వింగ్ ఏఎన్ఓ సుమిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురిని కరిచిన పిచ్చికుక్క

యల్లనూరు: మండల కేంద్రం యాడికిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. మంగళవారం మెయిన్ బజార్, తహసీల్దార్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లోని వీధుల్లో తిరుగుతూ కనిపించిన వారిని కనిపించినట్టుగా ఏడుగురు పిల్లలు, పెద్దలను కరిచి గాయపరిచింది. గాయపడిన వారిలో అనూష (5), నిహారిక (11), సలోమి (14), ప్రసాద్ (25), పవన్ కుమార్ (30), ఓబులేసు (50), ఓబులేసు(58) ఉన్నారు. వీరు యల్లనూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స, తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నారు. ఇదిలా ఉండగా పలువురిని కరచి తప్పించుకుపోయిన పిచ్చికుక్కను స్థానికులు వెంటాడి మరీ చంపేశారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



గుంతకల్లులో రాగిజావ పంపిణీ చేస్తున్నచైర్‌పర్సన్ భవాని



విద్యార్థులతో కలిసి రాగిజావ తాగుతున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి



తాడిపత్రిలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాసపురం సుధా శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, తహసీల్దార్ మునివేలు, ఎంఈఓ నాగరాజుతో కలసి ఆయన విద్యార్థులకు రాగిజావ అందించారు. ఈసందర్భంగా అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగనన్న శ్రీకారం చుట్టారన్నారు. నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వపాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక వంటి పథకాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం రాగిజావ అందిస్తున్నారన్నారు. ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రామమోహన్‌రెడ్డి, పీసీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మాధవయ్య, సీఆర్‌పీ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు భోగాతి బ్రహ్మానందరెడ్డి, పేరం ప్రతాపరెడ్డి, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కాశెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, రాయలచెరువులో సర్పంచు తలారి అరుణ, వైస్ ఎంపీపీ జమ్ములమడుగు హసీనాబేగం, వేములపాడులో సర్పంచు ఓంకారమ్మ, కొమ్ము ప్రసాద్ రెడ్డి, సాంబశివుడు, తూట్రాళ్లపల్లెలో సంజీవరాయుడు, లక్షుంపల్లెలో పద్మనాభరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి మంగళవారం విద్యార్థులకు రాగిజావా అందించారు. ఈ సందర్భంగా బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు రోజుల పాటు రాగిజావాను అందిస్తుందన్నారు.

యల్లనూరు: వెన్నపూసపల్లి ఉన్నత పాఠశాల, యల్లనూరు ఉన్నత పాఠశాల, వేములపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నుంచి కొత్త మెనూలో భాగంగా రాగిజావను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ భోగతి నారాయణరెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, వేములపల్లి సర్పంచి అశోక్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నత, ప్రాథమిక, ఉర్దూ స్కూల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి రాగిజావ తాగారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ రవి, మెప్మా సీఎంఎం భవానీ, పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

గుత్తి: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, గుత్తి ఆర్ఎస్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి మంగళవారం విద్యార్థులకు రాగి జావ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాగిజావ తాగడం వల్ల విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తి పెరగుతుందన్నారు. పీసీ చైర్‌పర్సన్ కోటా మనోహరి, కోటా వెంకటేష్, వార్డు ఇన్‌చార్జ్ రమేష్, షఫి, హెచ్‌ఎం ఉషా, ఆయా పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పామిడి: జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం లభిస్తోందని వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య అన్నారు. మంగళవారం దేవరపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందించారు. ఎంఈఓ జయానాయక్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: కొత్తపేట ఎంపీపీయూపీ పాఠశాలలో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ గురుమస్తాన్, ఎంఈఓ రవినాయక్, తొండపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీధర్‌గౌడ్, కరిడికొండలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, సుమలతబాయి రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రోజూ రాగిజావ తాగి ఆరోగ్యంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు రాముయాదవ్, నేతలు సుధాకర్, వెంకటరాముడు, సురేష్, తొండపాడు పీసీ కమిటీ చైర్మన్ నాగభూషణం, ఉపాధ్యాయులు శ్రీదేవి, వెంకటశేషయ్య, జయనిర్మల, భారతి, సురేష్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రోటరీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ సునీత జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీకేఎస్‌లోని గాంధీ నగర్ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో మండల తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న రాగి జావ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లే నారాయణస్వామి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, నాగభూషణ, కొండమ్మ పాల్గొన్నారు.

నార్పల: రాగి జావ ఆరోగ్యానికి ఎంతో మేలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రాగిజావ పంపిణీ చేశారు. సర్పంచు మన్నీల సుప్రియ, ఎంపీపీ నాగేశ్వరావు, పాఠశాల కమిటీ చైర్మన్ పల్లె బాలకృష్ణారెడ్డి, చికెన్ గోపాల్, బాలనాగి బాలకృష్ణ, నారాయణరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

శింగనమల: మండల వ్యాప్తంగా 52 ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈఓ నరసింహరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాడికిలో రాగిజావ అందిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు



గుత్తిలో రాగిజావ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ



వెన్నపూసపల్లిలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న భోగాతి నారాయణరెడ్డి

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు





గుంతకల్లుటౌన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరం ప్రజలకు అన్ని రంగాల్లోనూ శుభాలను చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ కృషి, దైవకృప, ప్రజల దీవెనలతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు.

శింగనమల: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలిపారు. షడ్రుచుల సమ్మేళనంతో వచ్చే ఉగాది పండుగ అందరి ఇళ్లలో ఆనందాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

గుత్తి: గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. గుత్తిలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలైన మోడల్ స్కూల్, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, మహాత్మా కాలేజీ వద్ద ఇంటర్ సుమారు 1000 మందికి మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా గేట్స్ కాలేజీ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన రోజు నుంచి గుత్తితో పాటు గుంతకల్లులో ఇంటర్ విద్యార్థులకు మజ్జిగను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. పరీక్షలు ముగిసే వరకు ఇంటర్ విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గేట్స్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

27లోపు దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: 2023–2024 విద్యాసంవత్సరానికి సంబంధించి కస్తూర్బా బాలికా విద్యాలయంలో మిగిలిన సీట్ల ప్రవేశాలకు 6,7,8వ తరగతుల విద్యార్థినులలు ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి మాధవి పేర్కొన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

రైతులూ అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం



రైతులతో వివరాలు తెలుసుకుంటున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుందని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన రేగడికొత్తూరు, పొడరాళ్ల, బాట్లో కొత్తపల్లిలో ఈదురుగాలులు, వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. మండలంలో ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో దెబ్బతిన్నాయో వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరిత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అధికారులకు పంట నష్టంపై నివేదికలు సిద్ధం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్న విషయాన్ని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని, సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, సర్పంచులు తిరుమలరెడ్డి, ఎర్రిస్వామి, నారాయణమ్మ, నాయకులు ఆలూరు రమణారెడ్డి, కొత్తపల్లి నాగలింగారెడ్డి, నాగిరెడ్డి, బుల్లే నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త పరామర్శ

యల్లనూరు: మేడికుర్తి గ్రామానికి చెందిన నాగప్రసాద్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జేసీయస్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి నాగప్రసాద్ రెడ్డిని పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు సూర్యనారాయణరెడ్డి, జయరామిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంటు నరేంద్రలు పాల్గొన్నారు.

రైతన్నలకు ప్రభుత్వం అండ

నార్పల: రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నేత అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇటీవల వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. ఎంపీపీ నాగేశ్వరావు, భూషణ, భాస్కర్ రెడ్డి, నారాయణరెడ్డి, నరసింహ, శ్రీకాంత్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నికల్ కళాశాల మంజూరుపై సంబరాలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంతకల్లుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయడంతో గుత్తిలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్ రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరిపారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక బ్లండ్ బ్యాంకు ఏర్పాటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, శాశ్వత తాగునీటి పథకం ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. టీడీపీ మూడు ఎమ్మెల్సీ స్థానాలు గెలవగానే అధికారంలోకి వచ్చినంత హంగామా చేస్తోందన్నారు. సింగిల్‌గా పోటీ చేస్తే ఘోర పరాభావం తప్పదని తెలుసుకున్న చంద్రబాబు జనసేనతో పొత్తుల కోసం రోజూ పవన్‌కళ్యాణ్ చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175 సీట్లు గెలవడం ఖాయమన్నారు. కౌన్సిలర్లు నజీర్, వాల్మీకి శివ, ఫరూక్, వరదరాజులు, కేవీ రమణ, నరేష్, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు జీపు రమణ, బింగి బాబు, సునీల్, రమేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెల్డింగ్ రవూఫ్, శంకర్‌రెడ్డి, డిష్ అన్వర్, ఇబ్రహీం, రంగస్వామి, చెన్నాజీ, అరటి పండ్ల చంద్ర, అబ్దుల్, హమాలి రామాంజి, అంగడి వలి, హరినాథ్ రెడ్డి, రషీద్, హరి, శేషారెడ్డి, దేవా, లక్ష్మిరెడ్డి, షఫి, ఖలీల్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత వైఎస్సార్‌సీపీదే



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, నాయకులు

గుంతకల్లుటౌన్: ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే వైవీఆర్ చెరగని ముద్రను వేసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వాస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌ను నెలకొల్పారన్నారు.హంద్రీనీవా కెనాల్ రాగులపాడు లిఫ్ట్ నుంచి డిస్ట్రిబ్యూటరీల ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు నీరందించేందుకు ప్రభుత్వం నుంచి రూ.59 కోట్లు విడుదల చేయించి పనులు ప్రారంభింపజేశారన్నారు. గుంతకల్లు ప్రజల 4 దశాబ్దాల కలైన పాలిటెక్నికల్ కళాశాలను సాధించారన్నారు. ఎన్నికల హామీ మేరకు ధర్మవరం రైల్వేగేట్, ఎస్ఎన్.పేట రైల్వేబ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారాని కోసం ఆర్‌యూబీ(రైల్ అండర్ బ్రిడ్జి)ల నిర్మాణానికి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు వేగవంతం చేశాయని ఆయన వెల్లడించారు. ఏసీఎస్ మిల్లు సమస్య కూడా అతిత్వరలోనే పరిష్కారం కానుందని ఆయన స్పష్టం చేశారు. ఈసందర్భంగా ఆయన సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ వై.సుధాకర్, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.ఖలీల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సాధించడం సంతోషకరమని, స్థానిక నిరుద్యోగ యువత కోసం రైల్వే అప్రెంటీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సుంకప్ప, మోహన్, కౌన్సిలర్లు సుధాకర్, లింగన్న, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు అహమ్మద్‌బాషా, సచివాలయాల పట్టణ, మండల కన్వీనర్లు జింకల రామాంజినేయులు, గోవింద్‌నాయక్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ భీమలింగప్ప, నాయకులు వెంకటేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి చేయూత



విద్యార్థినికి బ్యాంక్ ద్వారా డబ్బు పంపిన రశీదును చూపుతున్న ట్రస్ట్ సభ్యులు



విద్యార్థిని అమృత

గుంతకల్లుటౌన్: బెంగళూరులోని వైద్యవిద్యనభ్యసిస్తున్న గుంతకల్లుకు చెందిన నిరుపేద విద్యార్థిని అమృతకు అభయ విద్యానిధి ట్రస్ట్ అండగా నిలిచింది. అమృత కళాశాల ఫీజు నిమిత్తం రూ.97 వేలు ఆర్థిక సాయమందించినట్లు అభయ విద్యానిధి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సత్రసాల వసుంధర దేవి, అధ్యక్షురాలు దేవరశెట్టి మాధవీలత తెలిపారు. మంగళవారం కోదండరామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అభయ విద్యానిధి ట్రస్ట్ ద్వారా 2013 నుంచో ఇప్పటివరకు 112 మంది ఆడపిల్లల చదువు కోసం ఆర్థికసాయం అందజేశామన్నారు. ట్రస్ట్ కార్యదర్శి జీఎస్.వరలక్ష్మి, కోశాధికారి అనురాధ గుప్త, సంయుక్త కార్యదర్శి రాజ్యలక్ష్మి, సలహాదారురా డాక్టర్ హిమబిందు, సభ్యులు శాంతారాజ్, సుకన్య, జయలక్ష్మి, శారదా గీతా, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు త్రిస్లా, విజయా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విలేకరి దంపతులపై దాడి

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో విలేకరి దంపతులపై దాడి జరిగింది. వివరాలు..విలేకరి విశ్వనాథ్ రావు, ఆయన సమీప బంధువైన గోపీనాథ్‌కు మధ్య గత కొన్ని రోజులుగా స్థల వివాదం ఉంది. ఈ క్రమంలో సోమవారం గోపీనాథ్, ఆయన కుమారుడు మనోజ్‌లు మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న విశ్వనాథ్‌రావు. భాగ్యలక్ష్మిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

జ్యోతుల మహోత్సవానికి ఏర్పాట్లు

పెద్దపప్పూరు: నరసాపురం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించే జ్యోతుల మహోత్సవానికి తొగట వీర క్షత్రియులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ఉగాది రోజు చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ.

వలస కుటుంబాలకు వైద్య పరీక్షలు

గార్లదిన్నె: మర్తాడులో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వలస కుటుంబాలకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ షమీన్‌తాజ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామంలోకి 60 కుటుంబాలు వలసరావడంతో వైద్యసిబ్బంది వారి కుటుంబాలను సందర్శించి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఏఎన్ఎం జయంతి, శివమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: టి.కొత్తపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిపత్రి వైపు నుంచి గుత్తి వైపునకు వస్తున్న లారీ టి.కొత్తపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్, ఆటో ను ఢీకొంది. ప్రమాదంలో బైక్‌లో వెళ్తున్న పులివెందులకు చెందిన రఘు, లారీ డ్రైవర్ సుభీందర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ వారిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

గుంతకల్లు రూరల్: పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోగలిగితే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి సూచించారు. మంగళవారం మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నక్కనదొడ్డి తండాలో నిర్వహించిన కార్యక్రమానికి సూపర్‌వైజర్ హాజరయ్యారు. 15 రోజుల పాటు జరిగే పోషణ పక్వాడా కార్యక్రమంలో మొదటిరోజు చిరుధాన్యాలు, వాటి వల్ల కలిగే లాభాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ శాంతి ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.

సుంకం వసూలు వేలం మళ్లీ వాయిదా

గుంతకల్లుటౌన్: పట్టణంలో దినసరి, వారం మార్కెట్, జంతువధశాల, మాంసపు దుకాణాల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కు కోసం మంగళవారం కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించిన వేలం పాట ముచ్చటగా మూడోసారి వాయిదాపడింది. వేలం పాటను పాడటానికి కాంట్రాక్టలెవ్వరూ రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న, ఆర్ఓ నాసిర్ హుసేన్ తెలిపారు. కాగా ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణయించిన సర్కారు వారి పాటను ప్రారంభిస్తామని, నిబంధనలను అతిక్రమించే ప్రసక్తే లేదని వారు వెల్లడించారు. వేలంపాటను తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామో తేదీని తెలియజేస్తామన్నారు.

గ్రిల్ వర్క్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

తాడిపత్రి టౌన్: స్థానిక షంషీర్ వలి దర్గాలో మంగళవారం గ్రిల్ వర్క్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా సాదక్‌వలి, ఉపాధ్యక్షుడిగా జిలాన్ బాషా, సెక్రటరీగా యాసిన్‌వలి, జాయింట్ సెక్రటరీగా జాఫర్, ట్రెజరర్‌గా ఇలియాస్, గౌరవాధ్యక్షుడు దాదాపీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణాధ్యక్షుడు గంగయ్య పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

గుంతకల్లుటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న పాస్టర్ హన్నా మహబూబా వైద్యఖర్చుల నిమిత్తం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం చికిత్స పొందుతున్న పాస్టర్‌ను పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, పాస్టర్ మనషే, పాస్టర్ జీఆర్.ఆనంద్, గుంతకల్లు సభ్యులు ఆనంద్, సురేష్, డేవిడ్, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: కె.ఊబిచెర్ల గ్రామ సమీపంలో మంగళవారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు... కరిడికొండ గ్రామానికి చెందిన ఖాదర్ బాషా పని నిమిత్తం కె.ఊబిచెర్లకు బైక్‌పై బయలుదే రాడు. అయితే గ్రామ సమీపంలో మలుపులో ఎదురుగా మరో బైక్ వేగంగా రావడంతో దాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడ్డ ఖాదర్ బాషాను వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కసాపురానికి ప్రత్యేక సర్వీసులు

గుంతకల్లుటౌన్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి బుధవారం నుంచి ఈనెల 24 వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం నారాయణ స్వామి మంగళవారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి కసాపురంకు రూ.10, రైల్వేస్టేషన్ నుంచి కసాపురానికి రూ.20 చార్జీలను వసూలు చేస్తామన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

గుంతకల్లు రూరల్: రోజురోజుకూ తరిగిపోతున్న అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో మంగళవారం పాతకొత్తచెరువు ఉన్నత పాఠశాలలో అటవీ సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.

డ్రైనేజీ నిర్మాణాలతో పరిశుభ్రత

గార్లదిన్నె: గ్రామాల్లో డ్రైనేజీ నిర్మాణాలతో రోడ్లు పరిశుభ్రంగా ఉంటాయని ఎంపీడీఓ విజయ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ఇల్లూరులో డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మంజూరైన నిధులతో డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు.